శిక్షణ కరదీపికను విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు

## చేపలకు వ్యాధి నిర్ధారణ, ఆరోగ్య నిర్వహణపై శిక్షణ

కరీమాబాద్, ఆగస్టు 20: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞానకేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ సౌజన్యంతో చేపట్టిన చేపలకు వ్యాధి నిర్ధారణ, ఆరోగ్య నిర్వహణపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ మహేందర్, కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న మంగళవారం ప్రారంభించారు. చేపల ఆరోగ్య నిర్వహణపై రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం శిక్షణ కర దీపికను విడుదల చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు టెక్నాలజీపై దృష్టి పెట్టాలి

నర్సంపేటరూరల్, ఆగస్టు 20: విద్యార్థులు నూతన టెక్నాలజీపై దృష్టి సారించాలని డాక్టర్ విజయ్‌రెడ్డి అన్నారు. లక్నేపల్లి శివారు బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో జావాస్క్రిప్ట్‌పై మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వెబ్ డెవలప్‌మెంట్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ప్లేస్‌మెంట్స్ సాధించేందుకు ఈ వర్క్‌షాపు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిట్స్ చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు డాక్టర్ వీఎస్ హరిహరన్, డీన్ విక్రంరెడ్డి, బిట్స్ సెక్రటరీ డాక్టర్ జి.రాజేశ్వర్‌రెడ్డి, ఏవో సలేంద్ర సురేశ్, డాక్టర్ నారాయణ పాల్గొన్నారు.

## రుణమాఫీ ఫిర్యాదులకు అధికారులు

కాశీబుగ్గ, ఆగస్టు 20: జిల్లా పరిధిలో రైతు రుణమాఫీపై వినతులు స్వీకరించేందుకు ప్రతి మండలంలో ప్రత్యేక వ్యవసాయశాఖ అధికారిని నియమించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉషాదయాళ్ తెలిపారు. నర్సంపేటకు టి.కృష్ణకుమార్ 7288894755, నెక్కొండకు ఏ నాగరాజు 7288894760, ఖానాపురం బి.శ్రీనివాస్ 7288894759, నల్లబెల్లి బి.రజిత 7288894758, దుగ్గొండి బి.మాధవి 7288894757, చెన్నారావుపేట సీహెచ్. గోపాల్‌రెడ్డి 7288894756, పర్వతగిరి టీవీఆర్‌ఆర్ ప్రశాంత్‌కుమార్ 7288894719, రాయపర్తి జి.వీరభద్రం 7288894735, సంగెంకు సీహెచ్.యాకయ్య 7288894725, గీసుగొండ పి.హరిప్రసాద్ బాబు 7288894724, వర్ధన్నపేటకు పి.విజయ్‌కుమార్‌రెడ్డి 7288894720, వరంగల్, ఖిలావరంగల్‌కు ఎం.రవీందర్ 7288894713 ను నియమించినట్లు ఉషాదయాళ్ వెల్లడించారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోలీసులు, విద్యార్థులు

## సైబర్ నేరాల నివారణపై అవగాహన

పోచమ్మమైదాన్, ఆగస్టు 20: సమాజంలో పెరిగిపోతున్న నేరాలను అదుపులో ఉంచడానికి విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని షీటీం హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ అన్నారు. వరంగల్ ఎల్లంబజార్‌లో సైబర్ నేరాలు, మహిళలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఈవ్ టీచింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు షేర్ చేయొద్దన్నారు. ప్రిన్సిపాల్ ఎం.రాజు, కరస్పాండెంట్ ఎం.రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువకుడిని కాపాడిన 100 డయల్

మట్టెవాడ, ఆగస్టు 20: డయల్ 100 ఓ యువకుడి ప్రాణాలు కాపాడింది. వరంగల్ సంతోషిమాతగుడి ఎదురుగా రైల్వేట్రాక్ పక్కన ఉన్న మురికి కుంటలో యువకుడు పడి ఉన్నాడు. మంగళవారం సాయంత్రం అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి యువకుడి అర్తనాదాలు విని 100కు కాల్ చేశాడు. మట్టెవాడ సీఐ గోపి సిబ్బందితో వచ్చి బురదలో నుంచి యువకుడిని బయటికి తీశారు. బాధితుడు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నరేశ్‌కుమార్‌ను పోలీసులు ప్రశ్నించగా.. తాను పశువులను మేపుతూ నగర శివారులో ఉంటున్నానని, రెండు రోజుల క్రితం పచ్చిగడ్డి కోసం వచ్చి బురదలో కూరుకుపోయినట్లు తెలిపాడు. అతడి ప్రాణాలు కాపాడిన మట్టెవాడ పోలీసులను డీజీపీ జితేందర్ 'x' వేదికగా అభినందించారు.

కాపాడుతున్న పోలీసులు

# అంబులెన్స్‌లకు ఆదరణ కరువు

- మరమ్మతులకు వచ్చినా పట్టించుకునే నాథుడే లేడు
- వర్ధన్నపేట సీహెచ్‌సీలో మూలన పడిన రెండు వాహనాలు
- అత్యవసర పరిస్థితిలో ఇబ్బంది పడుతున్న రోగులు

నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌లు

వర్ధన్నపేట, ఆగస్టు 20: లక్షల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన అంబులెన్స్‌లను మరమ్మతులు చేయక మూలనపడేస్తున్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ పసునూరి దయాకర్ తన నిధుల నుంచి రెండు అంబులెన్స్‌లను కొనుగోలు చేసి పట్టణంలోని సీహెచ్‌సీకి అందించారు. ఇవి ఐదేళ్లపాటు ప్రజలకు విశేష సేవలు అందించాయి. అత్యవసరమైన వారిని వరంగల్ ఎంజీఎం దవాఖాన, ఇతర వైద్యశాలలకు తరలించేవి. ఈ నేపథ్యంలో వాహనాల్లో ఇంజిన్‌లో సమస్య వచ్చింది. అయితే, మరమ్మతులు చేయించాల్సిన అధికారులు పక్కన పడేశారు. దీంతో ఏడాది కాలంగా వాహనాలు ఆసుపత్రి ఆవరణలో ఉత్సవ విగ్రహంలా ఉన్నాయి. దీనివల్ల వాహనాలు మరింత పాడయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.

**జిల్లాలోనే ప్రసవాలు అధికం**

వర్ధన్నపేట సీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య జిల్లాలోనే అత్యధికంగా జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు నెలలో రెండుకు మించి కాన్పులు జరిగేవి కాదు. ఈ నేపథ్యంలో అధికారంలోకి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపర్చింది. సీహెచ్‌సీకి వైద్యులను కేటాయించడంతోపాటు ఆపరేషన్ థియేటర్‌లో మెరుగైన యంత్ర పరికరాలను సమకూర్చారు. దీంతో ఎనిమిదేళ్లుగా ఆసుపత్రిలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందాయి. బాలింతలు, నవజాత శిశువులకు ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే అన్ని వసతులు ఉన్న వరంగల్ ఎంజీఎంహెచ్, ఇతర ప్రసూతి వైద్యశాలలకు ఏ సమయంలోనే తరలించేందుకు అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపుతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అంబులెన్స్‌లను ఆసుపత్రులకు అందజేశారు. ఇందులో భాగంగానే వర్ధన్నపేట సీహెచ్‌సీకి రెండు వాహనాలు వచ్చాయి. గర్భిణులు, పసికందులకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నా రాత్రి సమయంలో కూడా సీహెచ్‌సీ నుంచి వెంటనే అంబులెన్స్‌ల సహాయంతో వరంగల్ నగరానికి తరలించేవారు. కానీ, ఈ వాహనాలు ఏడాది నుంచి పని చేయకపోవడంతో వైద్యులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా గర్భిణులకు ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే సకాలంలో వరంగల్‌కు తీసుకెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంబులెన్స్‌లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## వ్యర్థాలను ఎరువుగా వాడుకోవచ్చు

వ్యర్థాలను పరిశీలిస్తున్న అధికారులు

గీసుగొండ, ఆగస్టు 20: మరుగుదొడ్డిలో ఎండిన వ్యర్థాలను ఎరువుగా ఉయోగించుకోవచ్చని డీఆర్డీవో కౌసల్యాదేవి అన్నారు. జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్డి గుంతల్లో నిండిన వ్యర్థాలను ఖాళీ చేసే విధానంపై జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఈజీఎస్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్డి గుంతలపై ఉన్న మూతలను తెరిచి ఎండిన వ్యర్థాలు ఎరువుగా మారిన విధానాన్ని పరిశీలించారు. గతంలో విదేశీయులు ఈ గ్రామాన్ని సందర్శించి మానవ వ్యర్థాలను ఎరువుగా మార్చే విధానాన్ని పరిశీలించారని ఆమె గుర్తుచేశారు. ఈ ఎరువును పంటల పొలాల్లో వేసుకోవచ్చని సూచించారు. ఇంటి ఆవరణలో ఉన్న మొక్కలకు ఈ ఎరువు వేయాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో మొక్కలు నాటారు. శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి, అధికారులు పాల్గొన్నారు.

పోచమ్మమైదాన్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ

## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

వరంగల్‌చౌరస్తా/ కరీమాబాద్/సంగెం/వర్ధన్నపేట/రాయపర్తి/పోచమ్మమైదాన్, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కరీమాబాద్‌లో ఉర్సు హవేలీలో ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సాదిక్ ఆధ్వర్యంలో ఉర్సు హవేలీ పీఠాధిపతి ఎహియాపాషా ఖాద్రీ పండ్లు పంపిణీ చేశారు. సంగెంలో రాజీవ్ చిత్రపటం వద్ద కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. వర్ధన్నపేట, ఇల్లంద, కట్రియాలలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాయపర్తిలోని కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లో 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీష–శ్రీమాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి స్వర్ణ, బస్వరాజు సారయ్య, గుండేటి నరేందర్‌కుమార్ పాల్గొన్నారు.

## డబ్బాల తొలగింపుపై నిరసనల వెల్లువ

బాధితులతో మాట్లాడుతున్న నన్నపునేని

పోచమ్మమైదాన్, ఆగస్టు 20: వరంగల్ పోచమ్మమైదాన్ పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిలో వీధి వ్యాపారుల డబ్బాల తొలగింపుపై నిరసనలు వెల్లువెత్తాయి. మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం ఉదయం సిబ్బందితో వచ్చి డబ్బాలను కూల్చివేశారు. పోచమ్మమైదాన్ సెంటర్‌తోపాటు పోచమ్మ ఆలయానికి వెళ్లే దారికి ఇరువైపులా ఆటో మెకానిక్, పాన్ డబ్బాలు, మీసేవ కేంద్రం ఉన్నాయి. వ్యాపారులు, కార్మికులు లేని సమయంలో బల్దియా సిబ్బంది కూల్చివేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. తూర్పు మాజీ ఎమ్మెల్యే నరేందర్ చేరుకున్నారు. వీధి వ్యాపారులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపితే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంత్రి, ఎమ్మెల్సీలు అధికారులను అడ్డు పెట్టుకుని, వీధి వ్యాపారుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యకం చేశారు.పోచమ్మమైదాన్‌లో 48ఏళ్లుగా వ్యాపారం చేస్తున్న వారిని ఇబ్బందులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. బాధిత ఆటో మెకానిక్‌లు మహ్మద్ ఖలీద్, అజార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేయలేదన్నారు. పోచమ్మమైదాన్‌లోనే 30ఏళ్లుగా నివాసముంటూ డబ్బాలు ఏర్పాటు చేసుకొని మెకానిక్‌లుగా పనిచేస్తున్నామన్నారు. కార్పొరేషన్ అధికారులు ఇబ్బంది మమ్మల్ని పెట్టడం సరికాదన్నారు. వారి వెంట బాధితులు ఎండీ ఖలీద్, బాకర్ అలీ, బబ్బు, సాదిక్, మజార్, మల్లేశం, అజయ్, వంశీ, పెద్ద కుమార్, సంపత్, అజార్, ఎండీ జాకీర్ ఉన్నారు.

## కొత్తపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన

కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

కాశీబుగ్గ, ఆగస్టు 20: వరంగల్ 3వ డివిజన్ కొత్తపేటలో బుధవారం గ్రామ ఆలయాల అభివృద్ధి కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో బొడ్రాయిని ప్రతిష్ఠించారు. బుధవారం లక్ష్మీగణపతి హోమం, కుంకుమార్చన, గురువారం ఉదయం యంత్ర బింబ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొత్తపేట బొడ్రాయి కమిటీ నిర్వాహకులు లంకా ప్రతాప్‌రెడ్డి, నాగవరపు సుధాకర్, అనుమాండ్ల అనిల్, ఇందూరి నరేందర్, కొండా కుమారస్వామి, పురం సతీశ్, నేరెళ్ల రాజు, గాదే రాము, మేకల నవీన్ పాల్గొన్నారు.

**బండమీదిమామిడితండాలో..**

ఖానాపురం: బండమీదిమామిడితండాలో బొడ్రాయి ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరుగనున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు ప్రత్యేక పూజలు, గ్రామదేవతల ఆవాహన, తోరణ బంధనం, పుణ్యాహవచనం, అఖండ ప్రతిష్ఠ నిర్వహించారు.

## ఏఈవోల బదిలీ

ఖానాపురం/ వర్ధన్నపేట, ఆగస్టు 20: ఖానాపురం మండలం ధర్మారావుపేట క్లస్టర్ పరిధిలో పని చేస్తున్న ఈఏవో సంతోష్ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయికు, ఖానాపురం ఏఈవో సంధ్య నర్సంపేట మండలం లక్నేపల్లికి బదిలీ అయ్యారు. ధర్మారావుపేటకు మహ్మద్ అంకుషావలి (8500997435), ఖానాపురానికి ఆశాదీప్(7815910929) బదిలీపై వచ్చారు. అలాగే, వర్ధన్నపేట ఏవోగా పీ విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు.

## వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

చెన్నారావుపేట, ఆగస్టు 20: చెన్నారావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ సరోజ అన్నారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, చిన్న పిల్లల వైద్య నిపుణులు, స్త్రీల వైద్య నిపుణుల బృందం హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నర్సంపేట రూరల్, ఆగస్టు 20: మాదన్నపేటలో బాధిత కుటుంబానికి యూత్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన గొర్రె శారద ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దహనమైంది. మంగళవారం బాధిత కుటుంబాన్ని పోచమ్మ యూత్ క్లబ్ సభ్యులతోపాటు బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కడారి కుమారస్వామి పరామర్శించారు. అనంతరం శారదకు రూ.5,500 ఆర్థికసాయం అందించారు.

## మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

కరీమాబాద్, ఆగస్టు 20: వరంగల్ 39వ డివిజన్ కాశీకుంట, విద్యానగర్‌లో చేపట్టనున్న కట్టమైసమ్మ ఆలయ ప్రారంభోత్సవంతోపాటు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు కావేటి శంకర్, ఉపాధ్యక్షుడు సవరం రంజిత, ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్, సహాయ కార్యదర్శి పింగిళి యాకయ్య, సహాయ కోశాధికారి ఆడెపు లక్ష్మణ్ పాల్గొన్నారు.

## త్రిపుర గవర్నర్ రాకకు ఏర్పాట్లు

పర్వతగిరి, ఆగస్టు 20: త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి బుధవారం కల్లెడ ఆర్డీఎఫ్ కళాశాలకు వస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను మంగళవారం ఆర్‌డీఎఫ్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, ఎస్సై ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. గవర్నర్ పర్యటన సాఫీగా సాగేందుకు పలు సూచనలు చేశారు.

## 'సాంఘిక బహిష్కరణ చేస్తున్న వారిని శిక్షించాలి'

నల్లబెల్లి, ఆగస్టు 20: రజకులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని రజక సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా జక్రంపల్లిలో అగ్రవర్గాల వారు రజకులను సాంఘిక బహిష్కరణ చేయడాన్ని ఖండిస్తూ రజక సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాపాల లక్ష్మీనారాయణ నేతృత్వంతో మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు కొత్తపెల్లి అశోక్, వైనాల జంపయ్య, వీరస్వామి, రాజేశ్, వైనాల మధు, సంతోష్, వీరస్వామి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సాయం

పర్వతగిరి, ఆగస్టు 20: జమాల్‌పురం గ్రామానికి చెందిన దుడ్డు మాధవులు ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి మంగళవారం యంగ్‌స్టార్ యూత్ సభ్యులు మంగళవారం 50 కిలోల బియ్యం అందించారు. యూత్ అధ్యక్షుడు సాయిరేవంత్, ఉపాధ్యక్షుడు దేవేందర్, కోశాధికారి శేఖర్, కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, సాయి రోహిత్, వినయ్, వంశీకృష్ణ, రాధాకృష్ణ, వరుణ్, నితిన్, ప్రణీత్, ప్రవీణ్, రాకేశ్, శివ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడి మృతి

ఖిలావరంగల్, ఆగస్టు 20: గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ స్తంభంపల్లికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు హేండిగ శంకర్‌రావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన భౌతికకాయాన్ని కేయూ జాక్ చైర్మన్ కత్తెరపల్లి దామోదర్, బీఆర్ఎస్ నాయకులు తరగల ప్రసాద్, పాలబోయిన కృష్ణ, లకడే రామారావు, సింగారపు వంశీ శంకరరావు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కాలనీల్లో పోలీసుల తనిఖీ

కరీమాబాద్, ఆగస్టు 20: సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా మంగళవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గవిచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కాలనీలు, వాహనాలను తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడి అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-325792-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

CHANGE OF NAME

I, the undersigned KATTEKOLA VENKATRAMA RAO (Old Name), previously called KATTEKOLA VENKTRAM RAO (Old Name) and Residing at H.No. 2-12-294/1, Vidyaranyapuri, Opp: KUC 2nd Gate, Hanumakonda Dist.-506009, T.S. India and Solemnly Declare.

CHANGE OF NAME

★I, KOMATI BHARATHWAJA (New Name) Previously called KOMATI BHARADWAJA (Old Name), S/o KOMATI KISHORE R/o., H.No. 11-21-103, Snehanagar, Kashibugga, Warangal district-506002, T.S. solemnly declare.

NTW-17202

CHANGE OF NAME

★I, GANGISHETTI SREENIVASULU (New Name) previously called GANGISETTI SRINIVASULU (Old Name), S/o GANGISHETTI NARASAIAH R/o H.No. 9-10-138, Pinnavari Street, Warangal district - 506002, T.S. solemnly declare.

NTW-17201

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565

నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

# మరో నలుగురి అరెస్ట్

### దేవేందర్ హత్య కేసు వివరాలు వెల్లడించిన ఏసీపీ నర్సయ్య

వర్ధన్నపేట, ఆగస్టు 20: రాయపర్తి మండలం బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ హత్య కేసులో మరో నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సైలు నిందితుల వివరాలు వెల్లడించారు. జూలై 7న బురహాన్‌పల్లిలో మాజీ సర్పంచ్ దేవేందర్‌ను కొందరు హత్య చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇప్పటికే నలుగురిని జైలుకు తరలించారు. లోతుగా విచారించగా.. ప్రధాన నిందితుడు, ఇదే గ్రామానికి చెందిన పల్లె మురళి(31)తోపాటు ఇతడికి సహకరించిన హైదరాబాద్‌కు చెందిన సుంకరి ప్రసాద్‌నాయుడు, మార్నేని రాజు, కృష్ణయ్య, గోవిందు, చెన్నరాయుడు కారులో వెళ్తుండగా రాయపర్తిలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై అదుపులోకి తీసుకున్నారు.

**రూ. 30 లక్షలకు డీల్**

సూదుల దేవేందర్‌ను హత్య చేసేందుకు ప్రధాన నిందితులైన పల్లె మురళి, పల్లె మల్లేశ్ సుంకరి ప్రసాద్‌నాయుడు, మార్నేని రాజు, గోవిందు, కృష్ణయ్య, చెన్నరాయుడుకు రూ.30లక్షలు, రూ.3లక్షల విలువైన కారు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారీగా నిందితులు దేవేందర్‌తో పరిచయం పెంచుకొని నమ్మించారు. పథకం ప్రకారం జూలై 7న దేవేందర్ తన ఇంట్లో నిద్రిస్తుండగా తలపై బలంగా కొట్టి హతమార్చారు. కాగా, సుంకరి ప్రసాద్‌నాయుడుపై ఇప్పటికే మూడు హత్య కేసులు, పది వరకు నకలీ నక్సలైట్ కేసులు, గంజాయి, దొంగతనం, కిడ్నాప్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మార్నేని రాజుపై నల్లగొండ రూరల్, సదాశివపేట, చిన్నకోడూరు తదితర స్టేషన్లలో మూడు హత్య కేసులు ఉన్నట్లు ఏసీపీ వివరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

## సమస్యలపై నివేదిక అందజేత

వరంగల్‌చౌరస్తా, ఆగస్టు 20: కోల్‌కతాలో ఘటనతో ఆందోళన చేపట్టిన జూడాలు, ఎంజీఎం దవాఖానలో జూనియర్ డాక్టర్లకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఈనెల 14న ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మురళికి అందించిన వినతిపత్రాన్ని వైద్యాధికారులు పరిశీలించారు. విధుల్లో జూనియర్ డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించగా మంగళవారం నివేదికను అందజేశారు. వైద్య విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి త్వరలోనే చర్యలు చేపడుతామని ఆర్ఎంవో అంబి శ్రీనివాస్ హామీ ఇచ్చినట్లు జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయపర్తి, ఆగస్టు 20: ప్రజలు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట లీడింగ్ ఫైర్‌మెన్ బుర్ర రవీందర్ సూచించారు. వర్ధన్నపేట అగ్నిమాపక శాఖ సారథ్యంలో మంగళవారం మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ, వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై అగ్నిమాపక యంత్రంతో పలు ప్రదర్శనలు, మాక్‌డ్రిల్ నిర్వహించారు. గ్రామీణ మహిళలకు వంటగ్యాస్ వినియోగంపై అవగాహన లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది మహేశ్, అజ్మీర్ పాషా, సాయిరాం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

# మహిళలకు అవగాహన కల్పించాలి

- సఖీ సేవలపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలి
- బాధిత మహిళలకు తక్షణసాయం అందేలా చూడాలి
- కలెక్టర్ డాక్టర్ సత్యశారద

సఖీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, ఆగస్టు 20: సఖీ వన్ స్టాప్ కేంద్రాల సేవలపై మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం డీబ్లూనీ అధికారి హైమావతితో